క్లుప్తంగా

ఈరన్నస్వామికి అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్రంలో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం తదితర పూజలతో పాటు నిత్య పూజలు చేపట్టి, ఫల, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యంగా నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

మార్కెట్‌యార్డులో విద్యుత్ కోతలు

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కేవలం వేరుశనగకాయల మార్కెట్‌లోని పెద్ద లైన్‌లో కొంతమంది కమీషన్ ఏజెంట్ దుకాణంలో మాత్రమే విద్యుత్ కోతలు ఉన్నాయని ఏజెంట్లు చెబుతున్నారు. దీంతో చీకట్లో తమ కార్యకలాపాలు సాగించుకునేందుకు ఇబ్బందులు పడతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దుకాణాలకు వైర్లు సరిగా లేవని, కొత్త వైర్లు వేయాలని కోరుతున్నారు. రెండు రోజులకు ఒకసారి విద్యుత్ వస్తుందని, లేకపోతే అసలే రాదని పేర్కొంటున్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

కోసిగి: వర్షకాలంలో పశువులకు వ్యాధులు ప్రబలకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం పలు గ్రామాల్లో గొర్రెలకు, ఆవులు, గేదెలకు గోపాలమిత్ర సమక్షంలో టీకాలు వేయించారు. ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. తొలకరి చినుకుకు మేత మేసే గడ్డి ద్వారా ఈ వ్యాధి వస్తుందని, ముందస్తుగా ఈటీ వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు. అలాగే ఆవులు, గేదెలకు జబ్బువాపు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఇందుకు బ్లాక్ వాటర్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

నెహ్రూకు నివాళి

కోసిగి: దేశ మెదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీకృష్ణం రాజు దొర నెహ్రూ సేవలను కొనియాడారు. నాయకులు శ్రీనివాస రాజు దొర, శ్యాంప్రసాద్ దొర, ఉలిగయ్య, తాయన్న, గోవిందు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యవరణాన్ని పెంపొందించండి

ఆదోని అర్బన్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, పట్టణంలోని పార్కులు, ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని, పార్కులు, పచ్చని ప్రదేశాలు కబ్జాకు గురికాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతుండటంతో పట్టణంలో కాలుష్యం పెరిగిపోతోందని అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. క్లబ్ ప్రెసిడెంట్ జి.ఎం.లలిత, సభ్యులు ఎం.శ్రీధర్, కోమల, కృష్ణమోహన్, దేవరాజ్, విట్ విద్య, విట్‌లత, స్వప్న పాల్గొన్నారు.

గోనెగండ్లకు 275 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు

గోనెగండ్ల: మండలానికి 275 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారని వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. విత్తనాల కోసం ఇప్పటి వరకు 205 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. వేరుశనగ క్వింటాల్ రూ.9,500 కాగా 40 శాతం రాయితీ పోను రూ.5,700కే రైతులకు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తల్లికి సాంత్వన..బిడ్డకు లాలన

- ఆదోని మాతాశిశు ఆసుపత్రిలో తల్లీబిడ్డ సంరక్షణకు పెద్దపీట
- గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు
- శిశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇస్తున్న వైద్యులు
- ఏటేటా పెరుగుతున్న ప్రసవాల సంఖ్య
- 17 మండలాలకు పెద్దదిక్కుగా ఆసుపత్రి
- ఆధునిక వసతులు సమకూర్చిన ప్రభుత్వం

ఆధునిక వసతులు సమకూర్చిన ప్రభుత్వం.. నిబద్ధత కలిగిన వైద్యులు..ఆదరణతో కూడిన సేవలు.. నిత్యం అప్రమత్తంగా వ్యవహరించే సిబ్బంది..పసిగుడ్డును కంటికి రెప్పలా కాపాడుతుండటంతో నిత్యం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కేరింతలతో సందడిగా ఉంటుంది ఆదోని మాతాశిశు ఆసుపత్రి. సాధారణ కాన్పులకు ప్రాధాన్యతనిస్తుండటం, బాలింతలు, గర్భిణుల పట్ల చూపుతున్న శ్రద్ధ, వైద్యుల హస్తవాసి మంచిదవడంతో 17 మండలాలతో పాటు సమీప కర్ణాటక రాష్ట్రంలోని చాలా గ్రామాల గర్భిణులు, బాలింతలకు పెద్దదిక్కుగా మారింది ఈ ఆసుపత్రి.



ప్రసవం అనంతరం చికిత్స పొందుతున్న బాలింతలు



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ మాధవీలత

ఆదోని టౌన్: ఆదోని మాతాశిశు ఆస్పత్రి అంచలంచెలుగా ఎదుగుతూ తల్లీబిడ్డల సంరక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గర్భిణులు, బాలింతలు, చంటిబిడ్డలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మెప్పును పొందుతోంది. బ్రిటీష్ కాలం నుంచి ఆదోని డివిజన్ ప్రాంతంలోని గర్భిణులు, బాలింతలు, శిశు సంరక్షణ బాధ్యతను నిర్వర్తిస్తోంది. డివిజన్‌లోని 17 మండలాలు, 7 లక్షల మంది మహిళలు, చంటి బిడ్డలకు సేవలందిస్తూ వారి మనస్సు చూరగొంటోంది.

గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు..

ఆసుపత్రిలో ఐదు నెలల గర్భిణీ నుంచి ప్రసవం అయ్యేంతవరకు ప్రతినెల పరీక్షలు చేస్తారు. ప్రసవం ఆస్పత్రిలోనే చేస్తారు. ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో 8 మందికి గానూ 6 మంది గైనకాలజిస్టులు విధులు నిర్వహిస్తున్నారు. మత్తు డాక్టర్లు ముగ్గురు, చిన్నపిల్లల వైద్యులు ఐదుగురికి గానూ నలుగురు, జనరల్ ఫిజీషియన్ ఒకరు ఉన్నారు. 2021లో స్త్రీల, పిల్లల ప్రభుత్వ ఆస్పత్రిగా పేరు మార్చారు. ఆదోని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రం బ్రిటీష్ కాలం నుంచే కొనసాగుతుంది. అయితే 2001 జూన్ 5న స్త్రీల, పిల్లల ఆస్పత్రిగా రూపాంతరం పొందింది. గతంలో 50 పడకలు ఉండేవి. అయితే కాలానుగుణంగా గర్భిణుల సంఖ్య రెట్టింపు కావడంతో 50 పడకలు చాలడం లేదు. దీంతో ఆస్పత్రిలో రోగుల ఇబ్బందులు, చిన్నారుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం 2023లో మరో 50 పడకలను మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించింది. ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుంది. వంద పడకల ఆస్పత్రిగా మారడంతో పాటు ఆధునిక యంత్రాలు, వసతులు సమకూరడంతో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లల ఇక్కట్లు పరిష్కారమయ్యాయి. అలాగే వైద్యసేవలకు అవసరమైన వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు.

ప్రసవాల వివరాలు..

సంవత్సరం	సాధారణ కాన్పులు	సిజేరియన్ ప్రసవాలు
2019-20	3,697	1,416
2020-21	2,942	1,292
2021-22	3,258	1,441
2022-23	3,040	1,831
2023-24	3175	1876

17 మండలాలకు సేవలు

ఆదోని డివిజన్‌లోని 17 మండలాలకు చెందిన గర్భిణులు, బాలింతలు, పసిబిడ్డలకు ఈ ఆసుపత్రి పెద్ద దిక్కుగా మారింది. పత్తికొండ, కోసిగి, ఆలూరు, కౌతాళం, పెద్దతుంబళం, పెద్దహరివాణం, పెద్దకడబూరు, ఆస్పరితో పాటు కర్ణాటక నుంచి కేసులు ఆస్పత్రికి వస్తున్నాయి. ఆదోనిలో చిన్నపిల్లల ఆస్పత్రిలో ప్రసవం అంటే నమ్మకం. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారని నానుడితో అధికంగా వస్తున్నారు.

హెచ్‌డీయూ సెక్షన్ ఏర్పాటు..

మాతా, శిశు ఆస్పత్రిలో అత్యవసరం, రిస్క్ ఉన్న గర్భిణుల కోసం ప్రత్యేకంగా హెచ్‌డీయూ యూనిట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌లో ఎలాంటి సమస్యాత్మకమైన కేసులనైనా పరిష్కరించి ప్రసవం చేస్తారు. అలాగే..ఆస్పత్రికి ఐదు నెలల నుంచి 9 నెలల నిండిన గర్భిణులు రోజూ 300 మంది నుంచి 400 మంది దాకా ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకుంటారు.

పసికందుకు ఆధునిక సేవలు..

ఇక పసికందును సంరక్షించేందుకు చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో ఉండటంతో పాటు ఆధునిక పద్ధతుల్లో సేవలందిస్తుండటంతో బయటి వైద్యశాలలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది. ముఖ్యంగా కంగారు పద్ధతిలో పిల్లలకు చికిత్స చేస్తుండటం, అత్యవసర సేవలు లభిస్తున్నాయి.

స్కానింగ్ కోసం వచ్చాను



మొదటి కాన్పు.. ఏడు నెలలు. ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ కోసం వచ్చాను. స్కానింగ్ బాగా చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీ చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ల సేవలు చాలా బాగున్నాయి.

– లలిత, కోసిగి గ్రామం

గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేవు



మాతాశిశు ఆస్పత్రిలో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పరీక్షలు చేస్తున్నాం. ప్రతినెలా స్కానింగ్‌లో తల్లీ, బిడ్డల సంరక్షణను క్షుణ్ణంగా పరిశీలిస్తాం. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రసవాలు చేస్తున్నాం. గతంతో పోలిస్తే ఆస్పత్రిలో రెట్టింపు స్థాయిలో వైద్యులు, రోగులు పెరిగారు. ప్రభుత్వం పరికరాలను సమకూర్చింది. తల్లీ,బిడ్డ సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– సుజాత, గైనకాలజిస్టు

నియోజకవర్గానికి 14 టేబుళ్లు,19 రౌండ్లు



సిబ్బందికి సూచనలిస్తున్న శివనారాయణశర్మ



హాజరైన ఉద్యోగులు

- కౌంటింగ్ సిబ్బంది ముందు రోజే హాజరు కావాలి
- కౌంటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్‌ను అనుమతించం
- ఆదోని ఆర్వో, సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని రూరల్: జూన్ 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి కౌంటింగ్ సిబ్బంది ముందు రోజు రాయలసీమ యూనివర్సిటీలో హాజరు కావాలని ఆదోని ఆర్వో, సబ్‌కలెక్టర్ శివ నారాయణశర్మ తెలిపారు. సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదోని నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 4న జరిగే కౌంటింగ్‌కు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది ముందు రోజు అంటే 3వ తేదీ హాజరు కావాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందిని రాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు, టేబుళ్లకు కేటాయిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్‌కు అనుమతి లేదన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉడగా 14 టేబుళ్లు కేటాయిస్తామని, 19 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, అనంతరం ఈవీఎం మిషన్స్ కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం ఈవీఎం మిషన్ సీలింగ్ చేసి భద్రపరచాలని చెప్పారు. అప్రమత్తంగా ఉండి కౌంటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఎవరూ నిబంధనలను అతిక్రమించరాదని, పరిధి దాటి ప్రవర్తించిన వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తానమి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, కార్యాలయపు పరిపాలనాధికారి శేషయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర రావు, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, డిప్యూటీ తహసీల్దార్లు రామేశ్వర్‌రెడ్డి, వీరభద్రగౌడ్, వలీబాషా, దీప, వినీత్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో జాగ్రత్తగా వ్యవహరించండి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.మురళి

మంత్రాలయం : జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.మురళీ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఓట్ల లెక్కింపు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అవకతవకలకు తావు లేకుండా నిబద్ధతగా వ్యవహరించాలని ఆదేశించారు. ఉన్నత అధికారుల ఆదేశాలను పాటిస్తూ విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి 17 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, కేటాయించిన స్థానాల్లోనే అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తు ప్రారంభం

- తొలకరి వర్షాలకు ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు
- వారం రోజులుగా కురిసిన మోస్తరు వర్షాలకు పదునైన పొలాలు



పెద్దతుంబళం సమీపంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

ఆదోని రూరల్: ముందస్తు వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వారం రోజులుగా మోస్తరు వర్షాలు కురవడంతో రైతులు పొలాలను సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఎండకారు సేద్యం చేసిన రైతులు పొలాల్లో ఆదివారం నుంచి విత్తనాలు వేస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ, పత్తి, ఆముదం పంటలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్, పాండవగల్, బల్లేకల్, జాలిమంచి, దొడ్డనకేరి, మాంత్రికి, పెసలబండ, కపటి, నాగలాపురం, ఆరేకల్, బైచిగేరి, ఇస్వీ, చిన్నపెండేకల్, కడితోట, జి.హొసళ్లి, హాన్వాల్, మదిరె తదితర గ్రామాల్లో వేరుశనగ, పత్తి విత్తు చేపట్టారు. తొలకరి వర్షాలకు విత్తనం వేస్తే మంచి పంటలు పండుతాయనే నమ్మకంతో ముందస్తుగా విత్తు వేసినట్లు రైతులు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్నగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. ఈ మేరకు సోమవారం ఆయా సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జ్యోతికి వినతి పత్రం ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వేరుశనగ, వరి, కంది, మినుము, పెసర, నువ్వుల విత్తనాలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు చిన్నన్న, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు



పెసలదిన్నె ఆర్‌బీకెలో పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో విత్తుకోవడానికి అనువుగా ఉంటుందని చెప్పారు. మండలానికి 150 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. క్వింటాల్ రూ.9,500 కాగా రాయితీ పోను రైతు వాటాగా రూ. 5,700 చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలని, లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థులకు అడ్మిట్ కార్డులు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్. సుధాకర్ రెడ్డి

ఆదోని సెంట్రల్: పాలిసెట్–24 (పాలిటెక్నిక్) కళాశాలలో ప్రవేశాలు పొందడానికి అర్హత సాధించిన అభ్యర్థులకు ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ధ్రువ పత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ధ్రువ పత్రాలు పరిశీలనకు హాజరైన 20 మంది అభ్యర్థుల పత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్ రెడ్డి, సిబ్బంది పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒరిజినల్ పత్రాలను తీసుకు రావాలని సూచించారు. ముఖ్యంగా పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్క్స్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ, క్యాస్ట్, ఇన్‌కామ్ సర్టిఫికెట్లు, విద్యార్హతకు సంబంధించిన అన్ని పత్రాలతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో రావాలని చెప్పారు. జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్లో ఫీజులు చెల్లించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 చెల్లించి రసీదును జత చేయాలని చెప్పారు.ఫీజులు చెల్లించిన వారికి ధ్రువ పత్రాల పరిశీలన జూన్ 3వ తేదీ వరకు ఉంటుందన్నారు. 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కళాశాలల ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చునన్నారు. జూన్ 5న ఆప్షన్స్ మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్టీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బి.తాండ్రపాడు, కర్నూలులో జరుగుతుందన్నారు. స్పెషల్ కేటగిరి (ఎన్‌సీసీ, పీహెచ్, క్యాప్, స్పోర్ట్స్) వారికి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉంటుందని వివరించారు.

మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 28న బాలురకు చిన్నటేకూరులో, 29న బాలికలకు దిన్నె దేవరపాడు పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలుర విభాగంలో ప్రవేశ పరీక్షల్లో ఎస్సీ–22, ఎస్టీ–25, బీసీ–45, ఓసీ–44 మార్కులకు పైగా మార్కులు సాధించిన వారు మాత్రమే హాజరు కావాలని పేర్కొన్నారు.

గోనెగండ్లలో 22.6 మి.మీ వర్షపాతం

గోనెగండ్ల: మండలంలో ఆదివారం రాత్రి 22.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా నాలుగు రోజులుగా మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందే ప్రారంభం అయ్యిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో కురిసిన వర్షానికి కొందరు రైతులు పొలాలను దుక్కులు చేసుకుని వేరుశనగ, పత్తి తదితర పంటలను వేశారు. మరికొందరు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

మరిన్ని విత్తనాలకు ప్రతిపాదనలు

పెద్దకడబూరు : మండలానికి మరో 400 క్వింటాళ్ల సబ్సీడీ వేరుశనగ విత్తనాలు అవసరమని సంబంధిత జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు దొడ్డిమేకల గ్రామ రైతుభరోసా కేంద్రం వద్ద సోమవారం సబ్సీడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి 200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు కాగా వాటిని ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా విత్తనాలు అవసరం అవుతాయని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. అవి వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆదోని టౌన్: ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘించిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పెట్రోల్, డీజిల్ను లూజుగా విక్రయించరాదని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల యజమానులు, బాణసంచా దుకాణాదారులు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో లైసెన్స్ రద్దుతో పాటు చట్ట పర చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోనెగండ్ల: కలెక్టర్ ఆదేశాల మేరకు బాణసంచా విక్రయదారులు, పెట్రోల్ బంకు యాజమానులు ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని తహసీల్దార్ పార్వతీ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బాణసంచా విక్రయాలను జూన్ 6వ తేదీ వరకు నిలిపి వేయాలని ఆదేశించారు. అదే విధంగా పెట్రోల్ బంకు యాజమాన్యం బాటిళ్లు, క్యాన్‌లలో పెట్రోల్ పట్టరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

హెచ్‌డీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు



విత్తన నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి

కౌతాళం: హెచ్‌డీ పత్తి విత్తనాలు అమ్మితే ఆ షాపును సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌డీ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించిందని, అయినా కొందరు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దుకాణాల్లో తనిఖీలు చేపడతున్నామని చెప్పారు. అలాగే ప్రతి దుకాణంలో నుంచి విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపుతున్నామన్నారు. దుకాణదారులు విత్తనాలను నాణ్యమైనవి, నిర్దేశించిన ధరలకు విక్రయించాలని, అధిక ధరలకు, నకిలీవి అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే విక్రయించిన వాటికి సంబంధించిన బిల్లులను రైతులకు తప్పకుండా ఇవ్వాలని చెప్పారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



కోటేకల్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎమ్మిగనూరురూరల్: మండలంలో అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఏపీఓ విజయమోహన్ అన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో 4045 మంది కూలీలు పనికి వస్తున్నారని తెలిపారు. వర్షం కారణంగా కొన్ని చోట్ల పనులు నిలిచిపోయాయన్నారు. మంగళవారం నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు మొదలు పెడతామన్నారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. మట్టి పనులతో పాటు రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని తెలిపారు. రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం పంప్‌హౌస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఎమ్మిగనూరు సెబ్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మంత్రాలయం పంప్‌హౌస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన శివకుమార్, గోవిందును పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి నాలుగు బాక్సుల్లోని 384 (90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిని మద్యం విలువ రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అక్రమంగా మద్యం తరలించినా.. విక్రయించినా 9440902579 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్ పాల్గొన్నారు.